

**చీనీ టన్ను రూ.15,100**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15,100 పలికాయి.



**టమాట కిలో రూ.40**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.32, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

**గరిష్టం/కనిష్టం 34.9°/21.7°**

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమైంది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం అర్బన్:** 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈనెల 11న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితి గురించి కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీలను 'పరిష్కార వేదిక'లోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు.

### పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



**కూడేరు:** పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీ - నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను పీఏబీఆర్‌కు ఈ నెల ఒకటో తేదీ నుంచి మళ్లించారు. రోజూ 1,650 క్యూసెక్కులు, హెచ్ఎల్‌సీ ద్వారా కూడా డ్యాంలోకి 80 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శనివారం నాటికి డ్యాంలో 2.75 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. హెచ్‌హెన్‌ఎస్ఎస్, హెచ్చెల్సీ ద్వారా వచ్చే నీటిని డీఈ వెంకటరమణప్ప, జేఈఈలు లక్ష్మీదేవి ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక పర్యవేక్షిస్తున్నారు.

### జిల్లా అంతటా వర్షం

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఒకే రోజు 39.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు మండలంలో 86.2 మి.మీ, ఆత్మకూరు 70.4, శెట్టూరు 68.4, బెళుగుప్ప 65.4, విడపనకల్లు 61.4, తాడిపత్రి మండలంలో 61.4 మి.మీ భారీ వర్షం కురిసింది. అలాగే గుమ్మఘట్ట 58.2 మి.మీ, బ్రహ్మసముద్రం 58.2, పెద్దవడుగూరు 52.4, యల్లనూరు 49.8, యాడికి 48.4, గార్లదిన్నె 46.4, కంబదూరు 45.4, ఉరవకొండ 45.2, రాయదుర్గం 43.2, కుందుర్పి 39.6, కళ్యాణదుర్గం 39, అనంతపురం 32.4, గుంతకల్లు 30.2, శింగనమల 28.4, పామిడి 25.2, కణేకల్లు, రాప్తాడు 21, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం 20.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 91.2 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

# దిగజారి.. మసకబారి

- అనంతపురం నగరం సిండికేట్ నగర్‌లోని ఓ ఖాళీ స్థలంలోకి ఇటీవల కొంతమంది అక్రమంగా చొరబడ్డారు. హద్దు రాళ్లు పాతడం ప్రారంభించారు. స్థల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడికి వచ్చిన వారు ప్రేక్షకుల్లా చూస్తూ ఉన్నారు తప్ప కబ్జారాయుళ్లను అదుపు చేయలేకపోయారు. దీంతో బాధితుడి ఆవేదన అంతా ఇంతా కాదు.
- అనంతపురం సప్తగిరి సర్కిల్ వద్ద 20 రోజుల క్రితం అడ్డదిడ్డంగా వెళ్తున్న ఓ కారును ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఈ క్రమంలోనే కారు దిగిన డ్రైవర్.. పోలీసులపైనే చిందులు తొక్కాడు. దీనిపై టూటౌన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత నిందితుడిని విడుదల చేశారు.
- అనంతపురంలో నిన్న డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో పోలీసులు ఓ వ్యక్తిని పట్టుకున్నారు. కానీ ఆ వ్యక్తి ఖాకీలనే కొట్టబోయాడు. పోలీసులు సదరు మందుబాబును స్టేషన్‌కు తీసుకెళ్లబోతుండగా టీడీపీకి చెందిన ఓ నాయకుడు ఫోన్ చేసి విడిపించుకెళ్లారు. పోలీసులు ఎంతలా నిస్సహాయులుగా మారిపోయారో చెప్పే ఇలాంటి ఘటనలు నిత్యం ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.




**పోలీసుల హ్యాండ్సప్!**

- అస్సలు భయపడని భూ కబ్జారాయుళ్లు
- మద్యం తాగి ఖాకీలకే ఎదురు తిరుగుతున్న కొందరు..
- ఒక పార్టీకి, కొందరు నేతలకు వత్తాసు పలకడంతోనే దుస్థితి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని విమర్శలు

**సాక్షిప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసుల ప్రతిష్ట మసకబారింది. ఇప్పటికే శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో పాటు మట్కా, గంజాయి, జూదం విచ్చలవిడి అయ్యాయి. టీడీపీకి, ఆ పార్టీకి చెందిన కొంతమందికి పోలీసులు వత్తాసు పలుకుతుండటంతో జనంలో పూర్తిగా పలుచన అయ్యారు. చాలాచోట్ల పోలీసులకే ఎదురు తిరుగుతున్న దుస్థితి నెలకొంది. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు పోలీసుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వారి పనితీరే వారికి శాపంగా మారింది.

**లెక్క లేదు..**

జిల్లాలో పర్మిట్ రూములు, బెల్టుషాపులు ఇష్టారాజ్యంగా ఏర్పాటయ్యాయి. అన్ని హోటళ్లు, ధాబాల్లో మద్యం దొరుకుతోంది. చిన్న కాకా హోటల్‌కు వెళ్లినా మద్యం తాగుతున్న వారు కనిపిస్తున్నారు. ఈ క్రమంలో డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడుతున్న మద్యం రాయుళ్లు ఖాకీలపైనే తిరగబడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యపానానికి అనుమతులిచ్చి మళ్లీ తమను పట్టుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు మద్యం తాగి డ్రంకన్ డ్రైవ్‌లో దొరికినా వెంటనే టీడీపీ నాయకులు ఫోన్ చేసి 'మావాణ్ని వదిలెయ్' అంటూ ఆదేశించగానే వదిలేస్తుండడంతో పోలీసులంటే లెక్కలేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అలా వెళ్తారంతే..**

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రోజుకో కబ్జా, పూటకో ఆక్రమణ చందాన పరిస్థితి తయారైంది. స్వయానా పోలీసుస్టేషన్లలోనే కబ్జాదారులకు కుర్చీలేసి మరీ సెటిల్‌చేసి పంపిస్తున్నారు. బాధితులేమో విలపిస్తూ ఇంటికెళుతున్నారు. ఈ పరిస్థితుల్లో కబ్జా చేశారని ఎవరైనా బాధితులు ఫోన్ చేస్తే పోలీసులు చుట్టపుచూపుగా వెళ్లాల్సిందే కానీ కబ్జాదారులను శిక్షిస్తారని కాదని అరవిందనగర్‌కు చెందిన ఓ వ్యక్తి వాపోయాడు. రెండు జిల్లాల్లో పోలీసులున్నారని ఎవరూ అనుకోవడం లేదని, ఈ విషయం జనంలో బలంగా నాటుకుపోయిందని అంటున్నారు.

**హిందూపురంలో మరింత ఘోరం..**

హిందూపురం నియోజకవర్గంలో పోలీసుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని కిందిస్థాయి పోలీసు సిబ్బంది అంటున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు ఏది చెబితే అదే చట్టం, న్యాయం అన్నట్టుందని వాపోతున్నారు. ఎంత పెద్ద ఆఫీసర్ అయినా వాళ్లకు 'బాసు' ఎవరైనా ఉన్నారంటే అది బాలకృష్ణ పీఏలే! తమకు నచ్చకపోతే అడిషనల్ ఎస్పీలనే శంకరగిరి మాన్యాలను పట్టించిన ఘనత వీరిది. కాబట్టి ఇక్కడ పోలీసులు ఉన్నా లేనట్టేనని తెలిసింది.

### వైఎస్సార్ సీపీ వారిని వేధించడమే జేసీ పని



ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్‌రెడ్డి

**తాడిపత్రి టౌన్:** మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అధికార అండతో వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి అన్నారు. తాడిపత్రి పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇప్పటికే పట్టణంలో నిర్మాణంలో ఉన్న తన ఇంటిని ధ్వంసం చేయించిన జేసీ.. నేడు తన పొలాన్ని టార్గెట్ చేసి వేధింపులకు పాల్పడుతున్నాడన్నారు. ట్రాన్స్‌కో అధికారులను బెదిరించి నందలపాడు పొలం సర్వే నంబర్ 166ఏ, బీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారన్నారు. ఈ నెల 6న పొలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో తాను వెళ్లి అడ్డుకున్నానన్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా పొలంలో విద్యుత్ స్తంభాలెలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తే పనులు ఆపేస్తాం అని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారన్నారు. కానీ, రాత్రికి రాత్రి మళ్లీ తన పొలంలోకి చొరబడి స్తంభాలు నాటారన్నారు. 25 మీటర్ల మేర పొలంలోకి వచ్చి స్తంభాలు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ రాజారాం, సీఐ శివగంగాధర్‌రెడ్డికి వేర్వేరుగా ఆయన వినతి పత్రాలు అందజేశారు. విద్యుత్ అధికారులు న్యాయం చేయకపోతే కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

# పవన పుత్రా.. పాహిమాం





వజ్రకవచ అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి వారు, ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న ఉప లోకాయుక్త రజని

**గుంతకల్లు రూరల్/బొమ్మనహాళ్:** శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా జిల్లాలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి, నేమకల్లు ఆంజనేయ స్వామి క్షేత్రాలు కిటకిటలాడాయి. పవన పుత్రా.. పాహిమాం అంటూ భక్తుల నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. శనివారం వేకువజామునే ఆయా ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించిన అర్చకులు స్వామివార్లను విశేషంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివార్లను దర్శించుకునేందుకు ఉదయం 6 గంటల నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అన్నదానం చేపట్టారు. నేమకల్లు ఆంజనేయ స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర ఉప లోకాయుక్త రజని కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటకలోని బళ్లారి, కంప్లి మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు స్వామిని దర్శించుకున్నారు.





లక్ష తులసీదళాల అలంకరణలో నేమకల్లు అంజన్న, స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

# పచ్చ రౌడీల బీభత్సం

- అనంతపురంలో మైనార్టీ కుటుంబానికి చెందిన ఆప్టికల్ దుకాణంపై దాడి
- దుకాణంలో పని చేస్తున్న వ్యక్తులను చితకబాదిన వైనం
- 'రేయ్ కొడకా.. అంతు చూస్తా'మంటూ షాపు యజమానికి బెదిరింపులు
- గంటకు పైగా 'పచ్చ' గూండాలు రెచ్చిపోయినా కన్నెత్తి చూడని పోలీసులు



అనంతపురం సాయినగర్‌లోని అస్రా దుకాణం, (ఇన్‌సెట్‌లో) దుకాణానికి పచ్చ రౌడీలు తాళాలు వేసిన దృశ్యం

**అనంతపురం క్రైం/అనంతపురం:** నగరం నడిబొడ్డున ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన దుకాణంపై 'పచ్చ' రౌడీలు దాడికి తెగబడ్డారు. పదుల సంఖ్యలో చేరుకుని గంటకు పైగా హల్‌చల్ చేశారు. దుకాణంలో పని చేస్తున్న వారిని చితకబాదారు. వారు ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులు తీయగానే వెంట తెచ్చుకున్న తాళాలను దుకాణం నాలుగు షట్టర్లకు వేశారు. గట్టిగా కేకలు వేస్తూ వారు చేస్తున్న అరాచకం చూసి స్థానికులు హడలిపోయారు. ఇంత జరుగుతున్నా ఒక్క పోలీసు కూడా ఘటనా స్థలానికి చేరుకోకపోవడం గమనార్హం.

**అసలేం జరిగిందంటే..**

సాయినగర్ 6వ క్రాస్‌లోని అస్రా ఆప్టికల్ షాపు స్థలానికి సంబంధించి వివాదం కొంతకాలంగా నడుస్తోంది. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ రమణరావు తమకు అన్యాయం చేశారని, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, అతని బంధువు పేరును ప్రస్తావిస్తున్నారని ఇటీవల మీడియా ఎదుట బాధితురాలు బొనాల సుమయ వెల్లడించారు. ఈ క్రమంలోనే శనివారం దీనిపై విచారించాలని చెప్పడంతో డీఎస్పీ కార్యాలయానికి సుమయ దంపతులు వెళ్లారు. పోలీసులతో మాట్లాడిన అనంతరం సాయినగర్‌లోని దుకాణం వద్దకు చేరుకున్న వారు... కొద్దిసేపటి తర్వాత దుకాణం మూసివేసి ఇళ్లకు వెళ్లాలని తమ వద్ద పనిచేస్తున్న వారితో చెప్పి ఇంటికి వెళ్లారు.

**దుకాణం వద్ద అరాచకం..**

సుమయ దంపతులు ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే 30 మందికి పైగా 'పచ్చ' రౌడీలు సాయినగర్ 6వ క్రాస్‌లోని అస్రా దుకాణం వద్దకు చేరుకుని అరాచకం చేశారు. గట్టిగా కేకలు వేస్తూ భయోత్పాతం సృష్టించారు. దుకాణంలో పని చేస్తున్న కార్మికులపై దాడికి తెగబడ్డారు. వారు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని పరుగు తీయగా.. దుకాణానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. అనంతరం సుమయ భర్తకు ఫోన్ చేసి ఇష్టారాజ్యంగా మాట్లాడారు. 'ఎమ్మెల్యే పేరు ఎలా చెబుతావురా.. నా కొడకా' అంటూ అసభ్యంగా దూషించారు.

**దుండగులను తక్షణమే అరెస్టు చేయాలి..**

బాధితులకు మద్దతుగా నగరానికి చెందిన మైనార్టీలు సాయినగర్‌కు చేరుకున్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో స్పందించారు. గంటకు పైగా బహిరంగంగా దాడి చేస్తే పోలీసులకు కనపడలేదా అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిని శిక్షించేంత వరకు మైనార్టీలంతా ఏకమై ఉద్యమిస్తామని తెలిపారు. నగరంలో శాంతి భద్రతలు ఉన్నాయా అని ప్రశ్నించారు. తక్షణం దుండగులను అరెస్టు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

### ప్రవీణ్, లక్ష్మీనారాయణరెడ్డి బూతులు తిట్టారు

శనివారం రాత్రి పలువురు మైనార్టీలతో కలిసి బాధితులు సాయినగర్‌లోని తమ షాపు వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. జిల్లా కేంద్రంలో మెయిన్ సెంటర్‌లో ఉన్న దుకాణం వద్ద ఇంత అరాచకం సృష్టిస్తే ఒక్క పోలీసు కూడా రాలేదన్నారు. గుంటూరు ప్రవీణ్, బుక్కచెర్లకు చెందిన బెంచి లక్ష్మీనారాయణరెడ్డి అనే వ్యక్తులు తమకు పదులసార్లు ఫోన్లు చేసి ఇష్టారాజ్యంగా మాట్లాడారని వాపోయారు. తమకు వీరి నుంచి ప్రాణహాని ఉందన్నారు. తమ వద్ద పనిచేసే అమాయకులపై దాడి చేయడం దారుణమన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని రక్షణ కల్పించాలని కోరారు. ఇదంతా చూస్తుంటే తాము బతికుండి చనిపోయినట్లుగా ఉందన్నారు. దుకాణంలో తాము ఉండి ఉంటే తమ ప్రాణాలు తీసేవారే కదా అని బొనాల సుమయ కన్నీళ్లు పెట్టుకున్నారు.



పచ్చ రౌడీల దౌర్జన్యం గురించి మీడియాకు వెల్లడిస్తున్న బాధితురాలు

# రమణా నాయక్ ఎస్కేప్!

- కమిటీ విచారణకు గైర్హాజరు

**అనంతపురం మెడికల్:** లింగ నిర్ధారణ చట్టం అతిక్రమణ, ఐదు నెలల గర్భిణీ మృతికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణా నాయక్ విచారణకు హాజరు కాకుండా ఎస్కేప్ అయ్యారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం చదళ్ల గ్రామానికి చెందిన గర్భిణీ రాధమ్మ (29) నగరంలోని శ్రీ కృప ఆస్పత్రిలో ఆపరేషన్ చేసే సమయంలో మృతి చెందింది. డాక్టర్ రమణా నాయక్ నిర్లక్ష్యంతోనే మరణం సంభవించినట్లు తేలడంతో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశాలతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఘటనపై విచారణకు కమిటీని ఏర్పాటు చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, అనస్తీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ మనోహర్ రెడ్డిని సభ్యులుగా నియమించారు. ఈ క్రమంలోనే శనివారం సర్వజనాస్పత్రిలోని మెయిన్ ఆపరేషన్ థియేటర్‌లో కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. గర్భిణీ రాధమ్మకు మత్తు మందు ఇచ్చిన వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప, ఏఎన్‌ఎం మారెక్కను విచారించారు. అయితే, డాక్టర్ రమణా నాయక్ విచారణకు హాజరు కాలేదు. ఈ విషయమై అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఆయన స్పందించారు. విచారణ అనంతరం ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.



సర్వజనాస్పత్రిలో అనస్తీషియా వైద్యురాలిని విచారిస్తున్న దృశ్యం

### ఎట్టకేలకు వన్‌టౌన్ సీఐ నియామకం



సీఐ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్..

**అనంతపురం:** వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఎట్టకేలకు సీఐను నియమించారు. సీఐగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప నుంచి ఈయన బదిలీపై వచ్చారు. కాగా, గత రెండు నెలలుగా వన్‌టౌన్‌కు సీఐ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు అధికమయ్యాయి. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే స్పందించిన ఎస్పీ పి. జగదీష్ సీఐ నియామకానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. ఇదిలాఉంటే, గతంలో వన్‌టౌన్ సీఐగా గోరంట్ల మాధవ్ విధులు నిర్వహించిన సమయంలో అధిక వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. ప్రస్తుతం గోరంట్ల మాధవ్‌ను అక్కడి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అసాంఘిక శక్తులపై ఆయనలాగే కఠినంగా వ్యవహరించాలని ఆకాంక్షిస్తున్నారు.

# హోరాహోరీగా క్రీడా పోటీలు



పామిడిలో ఆటల పోటీల్లో తలపడిన క్రీడాకారులు

**పామిడి:** ఏపీ విద్యాభారతి జోనల్ స్థాయి క్రీడాపోటీలు శనివారం పామిడిలో హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-13, అండర్-15 విభాగాలకు సంబంధించి బాలబాలికలకు కబడీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ రేస్, లాంగ్‌జంప్, హైజంప్ వంటి పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానం పొందిన ప్రతిభావంత క్రీడాకారులు ఈ నెల 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం శ్రీనివాసన్ తెలిపారు. కార్యక్రమంలో రాంప్రసాద్, రాఘవయ్య, సునీల్ కుమార్, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

# రొళ్ల గురుకుల పాఠశాలలో అదనపు సీట్లు

**అనంతపురం ఎడ్యుకేషన్/ అనంతపురం రూరల్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం రొళ్ల పాఠశాలకు ఈ ఏడాది 5-10 తరగతులకు అదనపు సీట్లు మంజూరయ్యాయని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అదనపు సీట్లకు ఈ నెల 13న కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. 6, 7, 9 తరగతులకు జూన్ 25న జరిగిన ప్రవేశ పరీక్ష మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. 5వ తరగతి సీట్లు బీఆర్ఏజీ సెట్ రాసిన విద్యార్థులకు మెరిట్ ద్వారా అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. 9వ తరగతి ప్రవేశానికి పరీక్ష రాసిన విద్యార్థులు కొందరే ఉన్నారని వారు పోను తక్కిన సీట్లు, అలాగే 8, 10 తరగతుల సీట్లు తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల ద్వారా (గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు) వచ్చిన వారికి అవకాశం కల్పిస్తామని జయలక్ష్మి తెలిపారు. ఇవి అదనపు సీట్లు కాబట్టి స్కూల్‌లో చేరిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ బదిలీలు ఉండవని స్పష్టం చేశారు. మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామని ఎవరినీ నమ్మి మోసపోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

**తరగతుల వారీగా ఖాళీలు ఇలా...**

**5వ తరగతి ఖాళీలు:** ఎస్సీ-2 కేటగిరీలో 35, ఎస్సీ-3లో 35, ఎస్టీ-04, ఓసీ-01,
**6వ తరగతిలో** : ఎస్సీ-2 కేటగిరీలో 35, ఎస్సీ-3లో 34, ఎస్టీ-05, బీసీ-04, ఓసీ-01,
**7వ తరగతిలో**: ఎస్సీ-2 కేటగిరీలో 35, ఎస్సీ-3లో 35, ఎస్టీ-05, బీసీ-04, ఓసీ-01,
**8వ తరగతిలో** : ఎస్సీ-2 కేటగిరీలో 19, ఎస్సీ-3లో 18, ఎస్టీ-05, ఓసీ-01,
**9వ తరగతిలో** : ఎస్సీ-2 కేటగిరీలో 25, ఎస్సీ-3లో 25, ఎస్టీ-06, బీసీ-02, ఓసీ-02,
**10వ తరగతిలో**: ఎస్సీ-2 కేటగిరీలో 35, ఎస్సీ-3లో 35, ఎస్టీ-06, బీసీ-03 ఖాళీలున్నాయి.





# ఖర్జూర సిరులు



ఎడారి పంట అయిన ఖర్జూరం కరువు నేల 'అనంత'లో సిరులు కురిపిస్తోంది. జిల్లాలో పలువురు రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు ఆధునిక, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రజలకు ఆరోగ్యం తెచ్చిపెట్టే ఖర్జూర పంటతో మంచి లాభాలు వస్తుండటంతో రైతులు దీనివైపు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా క్రమేణా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- జిల్లాలో విస్తరిస్తున్న సాగు
- ఒకసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు దిగుబడులు
- ఖర్జూరాలకు మార్కెట్లో మంచి డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు రమణారెడ్డి

**గార్లదిన్నె:** జిల్లాలోని పలువురు రైతులు ఎప్పటికప్పుడు కొత్త తరహా పంటలు సాగు చేసి మంచి దిగుబడులతో దూసుకెళ్తున్నారు. అనంతపురం మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన రైతు రమణారెడ్డి కూడా వినూత్న పంటల సాగుతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లోని తమ వ్యవసాయ భూముల్లో ఇప్పటికే డ్రాగన్ ఫ్రూట్ పంట పెట్టి సక్సెస్ అయిన ఈయన ఖర్జూర పంటను పెట్టారు. ఈయన 2019లో కన్యాకుమారి యాత్రకు వెళ్తూ తమిళనాడులో జాతీయ రహదారిపై ఖర్జూర పండ్లు అమ్మడం చూశారు. అక్కడ ఉన్న ఖర్జూర పండ్ల తోటలను గమనించి, ఈ ఎడారి పంట సాగు విధానం చూసి ఎలాగైనా మన నేలలో సాగు చేయాలని భావించారు. అలా అనుకున్నదే తడవు తమకు మర్తాడు, కోటంక గ్రామాల పరిధిలో ఉన్న ఆరు ఎకరాల విస్తీర్ణంలో టిష్యూ కల్చర్ విధానంలో ఖర్జూర పంట కూడా సాగు చేస్తున్నారు. అబుదాబి నుంచి బర్హీ ఎల్లో రకం మొక్క రూ.4500 చొప్పున 500 ఆడ, 50 మగ మొక్కలు కొనుగోలు చేశారు. ప్రతి 100 ఆడ మొక్కల్లో 10 మగ మొక్కలు ఉండేలా



ఖర్జూర దిగుబడిని చూపుతున్న రైతు రమణారెడ్డి

నాటారు. ఒక్కసారి మొక్క నాటితే 40 ఏళ్లపాటు పంట దిగుబడి వస్తుంది. సాధారణంగా ఫిబ్రవరిలో పూత దశ ఉంటుంది. పూత సమయంలో ఆడ, మగ మొక్కలు సంపర్కం చేస్తేనే ఖర్జూర పంట వస్తుంది. సంపర్కం జరగకపోతే ఈత కాయల తరహాలో మారిపోతాయి. సంపర్కం చేసే రోజు వర్షం వస్తే పంట దిగుబడి రాదు. అలాగే తోటలో మగ మొక్కలు పూత తక్కువ వస్తే, సంపర్కం కోసం మగ పూత కిలో రూ.12,500 వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జూలై చివరిలో పంట కోత దశకు వస్తుంది.

**లాభదాయకమైన పంట**

మేము సిండికేట్ నగర్‌లో పట్టు చీరల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే వారం. కన్యాకుమారికి విహార యాత్రకు వెళ్లినప్పుడు ఖర్జూర పంట సాగు విధానం పరిశీలించాను. మా వ్యవసాయ భూమిలో సాగు చేద్దామని ప్రయోగాత్మకంగా చేపట్టాను. మొదట్లో ఇబ్బంది పడినా క్రమేణా సాగులో మెలకువలు తెలుసుకొని మంచి దిగుబడులు సాధిస్తున్నాం. పంట పెట్టుబడి ఎక్కువైనా ఆశించిన దిగుబడి వస్తోంది. 30 నుంచి 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుందని అంటున్నారు. ఇది మంచి లాభదాయకమైన పంటే.

– రమణారెడ్డి, రైతు, మర్తాడు

**ఏకరాకు రూ.7లక్షల దాకా పెట్టుబడి..**

పంట సాగులో మొదటి నుంచి సేంద్రియ ఎరువులు, ఆవుపేడ, గంజు, కోడి, గొర్రెల పెంట వంటి హీట్ ఎరువులు, జీవామృతం అధికంగా వాడాలి. ఎకరాకు రూ.7 లక్షల దాకా పెట్టుబడి అవుతుంది. నీరు కూడా చాలా ఎక్కువ అవసరం. ఎకరాకు 100 మొక్కలు సాగు చేయవచ్చు. మూడు నుంచి నాలుగేళ్లకే దిగుబడి వస్తుంది. ఐదు సంవత్సరాల్లో ఒక చెట్టు వంద కేజీల ఖర్జూర కాయలు కాస్తుంది. ఒక ఎకరంలో 5 టన్నుల దిగుబడి వస్తుంది.

**సేంద్రియ ఎరువులతో తెగుళ్లకు చెక్..**

ఖర్జూర పంటలో రైనోబీటిల్, రెడ్‌విల్ వంటి తెగుళ్లు వస్తాయి. ఈ తెగుళ్లు సోకిన మొక్క కిందకు వాలిపోతుంది. సేంద్రియ ఎరువులు అధికంగా వాడి తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగుకు చౌడు, నల్లరేగడి, ఇసుక లోమి నేలలు అనుకూలం.

**డిమాండ్ ఎక్కువే..**

ఖర్జూరకాయలకు డిమాండ్ ఎక్కువగానే ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తణుకు, విజయవాడ, హైదరాబాద్ నుంచి వ్యాపారస్తులు తోట వద్దకే వచ్చి పసుపు పచ్చని ఖర్జూర కాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్ కిలో రూ.120తో, టన్ను రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు రమణారెడ్డి 25 టన్నుల ఖర్జూర కాయలు విక్రయించారు. ఇంకా 10 టన్నులదాకా కాయలు చెట్ల మీద ఉన్నాయి.

## 'కార్లు ఇస్తామని మోసం చేశారు'

**గార్లదిన్నె:** కార్లు ఇస్తామని డబ్బు కట్టించుకుని తర్వాత మోసం చేశారని డ్రైవర్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపప్పూరు మండలం వెంగంపేటకు చెందిన ఓ మహిళ గార్లదిన్నెలో నివాసం ఉంటోంది. ఈమెకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మేనేజర్‌గా పని చేస్తున్న సాయితో పరిచయం ఉంది. ఈ క్రమంలో సంస్థలో సున్నా వడ్డీకి కార్లు ఇచ్చి.. సంస్థలోనే బాడుగకు పెట్టుకొని ప్రతినెలా నగదు చెల్లిస్తామని, అందుకు ముందుగా ఒక్కొక్కరూ రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని గార్లదిన్నెకు చెందిన కొంతమంది కారు డ్రైవర్లకు సదరు మహిళ ద్వారా సాయి తెలియజేశాడు. నమ్మిన డ్రైవర్లు ఒక్కొక్కరూ రూ.10 వేల చొప్పున ఆరుగురు కలిసి రూ.60 వేలు ఫోన్‌పే చేశారు. తర్వాత ఒక్కొక్కరు రూ.50 వేలు చెల్లించాలని చెప్పడంతో డ్రైవర్లందరూ కలిసి రూ.3లక్షలు చెల్లించారు. అలా ఒక్కొక్కరి నుంచి రూ.60 వేలు తీసుకున్న సాయి మూడు నెలలు అవుతున్నా కార్లు ఇవ్వకపోవడంతో డ్రైవర్లకు అనుమానం వచ్చింది. సాయికి ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ అని వచ్చింది. తాము మోసపోయామని గ్రహించిన డ్రైవర్లు శనివారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయితో పరిచయమున్న మహిళను విచారణ చేయగా.. తాను కూడా ఉద్యోగం కోసం రూ.2లక్షలు చెల్లించి మోసపోయానని పోలీసులకు తెలిపింది. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

# గిరిజనులు సంకల్పంతో ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మలోల

**అనంతపురం రూరల్/ టవర్‌క్లాక్:** గిరిజనులు ఏదైనా సాధించగలమన్న సంకల్పంతో ఎదగాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మలోల అన్నారు. శనివారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డీఆర్ఓ మలోల మాట్లాడుతూ సమాజంలో గౌరవంగా బతకాలంటే అది ఒక్క చదువుతోనే సాధ్యమని, ఆ దిశగా గిరిజనులు ఆలోచించి పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందుకుపోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ హరికుమార్, గిరిజన సంఘాల నాయకులు శివశంకర్‌నాయక్, సాకే వీరాంజినేయులు, పోలా వీరాంజినేయులు, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజనులకు ప్రాధాన్యత



కేక్ కట్ చేస్తున్న ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, చిత్రంలో మేయర్ వసీం

**అనంతపురం కార్పొరేషన్:** గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజనులకు అధిక ప్రాధాన్యత కల్పించారని, 1.5 లక్షల మంది గిరిజన రైతులకు 3 లక్షల ఎకరాల భూమి అందించి ఆదుకున్నారని మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడె శ్రీనివాసులు నాయక్ పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద మూడె శ్రీనివాసులు నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేయర్ వసీం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వత్థ నాయక్‌తో కలిసి శ్రీనివాసులు నాయక్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా గిరిజనులను విస్మరించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా గిరిజనులకు లబ్ధి చేకూరిందన్నారు. పార్టీలోనూ గిరిజనులకు సముచిత స్థానం కల్పించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో గిరిజనుల సంక్షేమాన్ని పక్కన పెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీలను లక్ష్యం చేసుకుని దారుణాలకు పాల్పడుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు పాలే జయరాం నాయక్, మల్లికార్జున నాయక్, సాకే చిరంజీవి, గుజ్జల శివయ్య, రాజు నాయక్, సూర్యనాయక్, సుంక నాయక్, హరినాయక్, రామాంజినేయులు, గుజ్జల శివ, శోభాబాయి, ఆనంద్, మోహన్ నాయక్, గుజ్జల వీర, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, పెన్నోబులేసు, శ్రీదేవి, కృష్ణవేణి, శోభా బాయి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## పైలట్‌గా హరిత



హరితను అభినందిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

**తాడిపత్రిటౌన్:** పట్టణానికి చెందిన సాయి హరిత ఇండిగో విమాన సంస్థలో పైలట్‌గా ఎంపికయ్యారు. ఓ యువతి ఈ ఘనత సాధించడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. రెడ్డివారిపాలెంకు చెందిన మనోహర్‌రెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె సాయి హరిత చెన్నైలో బీటెక్ పూర్తి చేశారు. దక్షిణాఫ్రికాలో పైలట్ శిక్షణ పొందారు. ప్రస్తుతం ఇండిగో సంస్థలో పైలట్‌గా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఈమెను శనివారం తాడిపత్రి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, నరసింహులు, శివయ్య, ఆదినారాయణస్వామి, చంద్రశేఖర్, రమణరాజు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ స్తంభించిన
# తపాలా సేవలు



అనంతపురంలోని తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో బోసిపోయిన కౌంటర్లు

**అనంతపురం సిటీ:** సర్వర్ మళ్లీ మొరాయించడంతో తపాలా సేవలు స్తంభించాయి. అనంతపురం, గుంతకల్లు ప్రధాన కార్యాలయాలతో పాటు 64 సబ్, 407 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలందించే క్రమంలో సాంకేతికతను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర తపాలా శాఖ 2.0 కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి అమలుకు శ్రీకారం చుట్టింది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసినా దాని పని తీరు మెరుగుపడలేదు. అరొకరగానే సేవలందాయి. ఈ నెల 4న పూర్తిగా ఆన్‌లైన్ సేవలు అందకుండాపోయాయి. రేయింబవళ్లు శ్రమిస్తున్నా సమస్యను పూర్తి స్థాయిలో అధిగమించలేకపోయారు.

**సమస్య కొలిక్కి వచ్చినట్లే వచ్చి..**

ఈ నెల 5న మధ్యాహ్నం నుంచి సర్వర్ పని చేయడం మొదలుపెట్టింది. ఇక ఎటువంటి సమస్యా ఉత్పన్నం కాదని తపాలా అధికారులు, వినియోగదారులు ఊపిరిపీల్చుకున్నారు. వారి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. శనివారం సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయింది. అనంతపురం, గుంతకల్లు సహా అన్ని పోస్టాఫీసుల్లో రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, పార్సిల్స్, పోస్టల్ ఇన్సూరెన్స్ సహా అన్ని రకాల బుకింగ్ సేవలు స్తంభించాయి.

**తల పట్టుకుంటున్న అధికారులు..**

అనంతపురం హెడ్ పోస్టాఫీసులో ఉద్యోగులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. వినియోగదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వారికి సమాధానం చెప్పలేక నలిగిపోతున్నారు. దీనికి తోడు రాత్రి 10 గంటల వరకు పని చేస్తున్నా.. ఫలితం లేకుండా పోతోందని తెలిపారు. సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా తమకు ప్రశాంతత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.


## కోన క్షేత్రంలో జల సోయగం



మారడమ్మ జలపాతంలో నీరు ప్రవహిస్తున్న దృశ్యం

**యాడికి:** కోన క్షేత్రంలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఎదురుగా కోన జలపాతం, వెనుకవైపు మారడమ్మ జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నేరడుచెర్ల, బూర్గుల గ్రామాల్లో దట్టమైన అడవిలోంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహం ఇక్కడ జలపాతాలుగా మారాయి. వర్షపు నీరు యాడికి మండలంలోని కోన క్షేత్రంలో గల రామలింగేశ్వర స్వామి దేవాలయం వెనుక అరకిలో మీటరు దూరంలో కొండలపై ఉన్న మారడమ్మ దేవాలయం ముందర నుంచి ప్రవహిస్తూ కిందకు వర్షపు నీటితో దూకడంతో జలపాతం ఏర్పడింది. రాళ్ల గుట్టలు, పాల నురగలాంటి ప్రవాహం, పచ్చని ప్రకృతి పరిసరాలు సందర్శకులకు ఆహ్లాదం పంచుతాయి. శనివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చి జలపాతం అందాలు తిలకించి.. స్నానాలు చేసి ఆనందంగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలకు పోజులిస్తూ పచ్చని చెట్ల మధ్య నుంచి వస్తున్న జలధారలతో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామి దేవాలయం చేరుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు.

# దురుసు ప్రవర్తన.. ఆపై హత్య



మృతుడు చిన్న వెంకట్రాముడు

**అనంతపురం:** తన దురుసు ప్రవర్తనను ప్రశ్నించిన వ్యక్తిపై ఓ యువకుడు కొట్టి చంపాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం మంగమడక గ్రామానికి చెందిన చిన్న వెంకట్రాముడు (50) అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సుభాష్‌రోడ్డులోని వస్త్ర దుకాణంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వీక్ ఆఫ్ కావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. మౌలాలి అనే స్నేహితుడితో కలిసి చిన్న వెంకటరాముడు రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద ఉన్న అన్న క్యాంటీన్ వద్దకు రాత్రి 7 గంటలకు వెళ్లాడు. అక్కడ భోజనం చేస్తుండగా ఒకటో రోడ్డు వినాయక్ నగర్‌కు చెందిన రామాంజినేయులు అలియాస్ రామాంజి అనే యువకుడు 'రేయ్.. మా వాళ్లు ఎక్కడికి వెళ్లారు' అని వెంకట్రాముడిని దురుసుగా అడిగాడు. దీంతో చిన్న వెంకట్రాముడు 'ఎవరు నువ్వు.. చిన్నా..పెద్దా తేడా లేకుండా రేయ్ అని అంటున్నావని ప్రశ్నించాడు. నాకే ఎదురు మాట్లాడుతావా అంటూ ఆగ్రహించిన రామాంజి.. చిన్నవెంకటరాముడు ముఖంపైన, ఛాతీపైన మూడునాలుగుసార్లు బలంగా గుద్దాడు. అనంతరం చిన్న వెంకటరాముడు అక్కడి నుంచి ఇంటికి వచ్చి మంచంపై పడుకుని మౌనంగా ఉండిపోయాడు. కుటుంబ సభ్యులు ఏమైందని అడగ్గా.. క్యాంటీన్ వద్ద జరిగిన విషయం తెలిపి స్పృహ కోల్పోయాడు. వెంటనే కుమారులు వినోద్ కుమార్, విజయ్ కుమార్ అన్న క్యాంటీన్ వద్దకు వెళ్లి 'మా నాన్నను ఎందుకు కొట్టావ్' అని నిలదీస్తే రామాంజి అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వచ్చి చిన్న వెంకటరాముడిని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే చిన్న వెంకటరాముడు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు రామాంజినేయులుపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు.

## బంధువుల మధ్య ఘర్షణ

**గుత్తి:** బంధువుల మధ్య సరదా సంభాషణ శ్రుతిమించి ఘర్షణకు దారి తీసింది. గుత్తి ఆర్ఎస్‌లో బంధువులైన నరసింహులు, సుధాకర్ శనివారం రాత్రి సరదాగా మాట్లాడుకుంటుండగా ఉన్నట్టుండి సీరియస్ అయ్యారు. కోపోద్రిక్తుడైన సుధాకర్ బీరుబాటిల్‌తో నరసింహులు తలపై దాడిచేసి గాయపరిచాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. బాధితుడు నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### సేవా కార్యక్రమాలు చేపట్టాలి



అన్నదానం చేస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురాం

**అనంతపురం కల్చరల్:** సినీ నటుల అభిమానులు కేవలం సినిమాలను విజయవంతం చేయడం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మాజీ మేయర్ రాగే పరుశురాం సూచించారు. శనివారం కృష్ణ సేన నాయకుడు కుళ్లాయప్ప ఆధ్వర్యంలో నెహ్రూ బాలభవన్ సమీపంలో సినీనటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మేయర్ రాగే పరుశురాం కేక్ కట్ చేసి అందరితో సంతోషాలను పంచుకున్నారు. మహేష్ బాబు అభిమానులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతుండటం స్ఫూర్తిదాయకమన్నారు. పేద కుటుంబాలకు ఆపరేషన్లు చేయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవిరాజ్, కృష్ణచైతన్య, శ్రీనివాసరెడ్డి, రఫీ, అరవింద్, నారాయణరెడ్డి, ఈశ్వర్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### అన్ని శాస్త్రాలకు మూలం సంస్కృతం



ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

**అనంతపురం ఎడ్యుకేషన్:** స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో సంస్కృత విభాగం ఆధ్వర్యంలో శనివారం సంస్కృత భాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని శాస్త్రాలకు మూలం సంస్కృతం అన్నారు. సంస్కృతం అనేది కేవలం భాష మాత్రమే కాదని.. గౌరవించాల్సిన సంస్కృతితి అని పేర్కొన్నారు. తెలుగు, హిందీ వ్యాకరణాలు సంస్కృతంలోనే పుట్టాయన్నారు. ప్రిన్సిపాల్ ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంస్కృతంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నాగరికత మూలాలను అన్వేషించడంలో, అర్థం చేసుకోవడం, కొనసాగించడానికి, సంస్కృతంను సజీవంగా ఉంచాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృత శాఖాధిపతి అంకే ఆదెప్ప, హిందీ శాఖాధిపతి శ్రీనివాసులు, తెలుగు శాఖాధిపతి మురళి, ఏఓ శ్రీనాథ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఘనంగా బలరామ జయంతి



అలంకరణలో రాధాపార్థసారథులు

**అనంతపురం కల్చరల్:** కృష్ణాష్టమి వేడుకలకు ముందొచ్చే బలరామ జయంతి వేడుకలు శనివారం ఇస్కాన్ మందిరంలో కనుల పండువగా జరిగాయి. జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగ దాసు నేతృత్వంలో కృష్ణభక్తులు భజన గీతాలు ఆలపిస్తూ ఆనందతాండవం చేశారు. రాధాపార్థసారథుల పాలరాతి విగ్రహాలను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. హరేకృష్ణ నామస్మరణతో మందిరం ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసంలో దామోదర ప్రభు బలరామ జయంతి విశిష్టతను తెలియజేశారు. జగతిలో అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా బలరామకృష్ణులు ఆదర్శ పురుషులుగా నిలిచారన్నారు. అనాదిగా వస్తున్న మైత్రీ బంధానికి గుర్తుగా సాగే వేడుకలు అందరిలో ప్రశాంతతను నింపుతాయని పేర్కొన్నారు. అనంతరం మహామంగళ హారతి, పుష్పాభిషేకం, తీర్థప్రసాద వితరణ జరిగాయి.

### వైభవంగా ఏడు శనివారాల వ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

**అనంతపురం కల్చరల్:** నగరంలోని వైష్ణావాలయాల్లో శ్రావణమాస సందడి నెలకొంది. మూడవ శ్రావణ శనివారం కావడంతో భక్తులు బారులు తీరి పలు చోట్ల సామూహిక వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో శ్రావణమాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అడ్డపడి పూజలు చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరుల ఆధ్వర్యంలో వందలాది మందికి ప్రసాద వితరణ జరిగింది. స్థానిక రామనగర్, హౌసింగ్ బోర్డు, ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏడు శనివారాల వ్రతాలు కనుల పండువగా జరిగాయి. మహిళలు ఏకరూప దుస్తుల్లో బారులు తీరి స్వామివారి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వందలాది మందికి అన్నదానం చేశారు. అలాగే పలుచోట్ల నాగులకట్టల వద్ద భక్తులు పాలు పోసి నాగదేవతలను పూజించుకున్నారు.

# వానొస్తే బురదమయం

- సహనాన్ని పరీక్షిస్తున్న ముస్లిం మైనార్టీ కాలనీ రోడ్డు
- చిత్తడిగా మారడంతో తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు





ముస్లీం మైనార్టీ కాలనీలో మట్టి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

**రాప్తాడు:** రాప్తాడు పంచాయతీలోని ముస్లి మైనార్టీ కాలనీ రోడ్డు కొద్ది పాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. ఈ రోడ్డుపై ప్రయాణమంటే స్థానికులు హడలిపోతున్నారు. ప్రసన్నాయపల్లి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ, ప్రసన్నాయపల్లి, ఆర్‌జేసీ ప్యాలెస్, చిన్మయ నగర్, ఇందిరమ్మ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, జగనన్న కాలనీ తదితర ప్రాంతాల వాసులు ధర్మవరం ఫంగల్ రోడ్డు, ఎస్కేయూ, బత్తలపల్లి, ధర్మవరం, కదిరి ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో గత ప్రభుత్వంలోనే రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేసినప్పటికీ స్థల సేకరణకు స్థానికుల అభ్యంతరాలతో రోడ్డు పనులు జరగలేదు. దీంతో ఇక్కడ రోడ్డు కొద్ది పాటి వర్షానికే చిత్తడిగా మారి ప్రమాదకరంగా మారుతోంది. ఇక్కడ సీసీ రోడ్డును నిర్మించాలని పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న వారు కరువయ్యారని వాహనదారులు మండిపడుతున్నారు. రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా ఉండడంతో పలువురు చుట్టూ తిరిగి గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ఇక్కడ రోడ్డును నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య సైతం కొంత మేర తగ్గే అవకాశం ఉంది.

**సీసీ రోడ్డును ఎప్పుడు పూర్తి చేస్తారో?**

ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా 2007లో అప్పటి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ముస్లిం మైనార్టీ కాలనీలో ఒక్కొక్కరికీ ఒకటిన్నర సెంటు చొప్పున దాదాపుగా 150 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అప్పటి నుంచి టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల్లో ఆ కాలనీలో మరో 300 మందికి పైగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అప్పటి నుంచి మెయిన్ రోడ్డుపై సీసీ రోడ్డును వేయకుండా మట్టి రోడ్డును మాత్రం వేసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాయకులు, అధికారులు తమ కాలనీలో మెయిన్ రోడ్డు (జేఎన్‌టీయూ రోడ్డు) సీసీ రోడ్డు వేయడానికి ఏక పక్షంగా రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీలో 30 అడుగుల రోడ్డు ఉండగా.. రికార్డుల్లో 52 అడుగుల రోడ్డు ఉందని అధికారులు చెబుతుండడంతో మండిపడ్డారు. రోడ్డుకు (దక్షిణం వైపు) ఒక వైపు మాత్రమే ఇళ్లను బలవంతగా తొలగించడంతో స్థానికులు అధికారులు, నాయకులతో వాగ్వాదానికి దిగారు. రోడ్డుకు రోడ్డు వైపులా తొలగించాలని అడ్డు పడటంతో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లను తొలగించి డ్రైనేజీలు వేశారు. సీసీ రోడ్డు ఎప్పుడు పూర్తి చేస్తారో అని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

### సీసీ రోడ్డు నిర్మించాలి



అధికారులు, నాయకులు కాలనీలో మెయిన్ రోడ్డు నిర్మిస్తామంటూ కాలనీలో రెండు వైపులా ఇళ్లను కూలిచ్చేశారు. దక్షిణం వైపు ఉన్న ఇళ్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. రోడ్డుపై నిర్మించారనే కారణంతో మాకు చెప్పకుండా సగం ఇంటిని తొలగించారు. అప్పులు తెచ్చి, బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి ఇంటిని నిర్మించుకున్నాను. కాలువలు వేసి మూడు నెలలు అవుతున్నా.. సీసీ రోడ్డు పూర్తి చేయలేదు. ప్రస్తుతం 100 మీటర్లు మాత్రమే సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు.

– షామీర్, ముస్లి మైనార్టీ కాలనీ

### జారి పడుతున్నాం



కాలనీ వీధుల్లో సీసీ రోడ్లు వేసినా మెయిన్ రోడ్డు 100 మీటర్లు మాత్రమే వేసి నిలిపివేశారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చినప్పుడు బయటకు రావాలంటే భయమేస్తోంది. మెయిన్ రోడ్డుపై మోకాళ్ల లోతు వరకు నీరు నిలడుతోంది. ఈ రోడ్డుపై ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలయ్యారు. నేను కూడా రెండు సార్లు కింద పడ్డాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలి.

– కుంపటి నరసింహులు, ముస్లి మైనార్టీ కాలనీ

### అందరూ ఉన్నా అనాథనే..



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు లక్ష్మీదేవి. పాతూరులో నివాసం ఉంటోంది. భర్త చనిపోయాడు. కూతురు, అల్లుడు పట్టించుకోకపోవడంతో ఆలనపాలన చూసే వారు కరువయ్యారు. కన్న కూతురు నిర్లక్ష్యం చేయడంతో అనాథలా మారిపోయింది. నగరంలో పొట్ట కూటి కోసం ఇలా భిక్షాటన చేస్తోంది. శనివారం ఆర్అండ్‌బీ అతిథి గృహం ఫుట్‌పాత్‌పై కూర్చున్న లక్ష్మీదేవి.. అయ్యా ధర్మం చేయండి.. అంటూ వేడుకున్న దృశ్యాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. అటుగా రాకపోకలు సాగించే పలువురు సాయం చేశారు. భిక్షాటనతో వచ్చిన డబ్బుతో కాలం వెల్లదీస్తున్నట్లు వృద్ధురాలు దీనంగా తెలిపింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

# ఇలా వచ్చి.. అలా వెళ్లారు!



ఎన్ఆర్‌సీ నుంచి ఉదయం 11.05 గంటలకు వెళ్తున్న డాక్టర్ సతీష్



మెన్స్ హౌస్‌సర్జన్ హాస్టల్ నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్లిపోతున్న దృశ్యం

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్ (ఎన్ఆర్‌సీ)లో వైద్యులు, సిబ్బంది పని తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. అవకాశం దొరికితే చాలు విధులకు డుమ్మా కొడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ ప్రేక్షకపాత్ర పోషిస్తుండడంతో ఎన్ఆర్‌సీ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. శనివారం సర్వజనాస్పత్రిలో ఎన్ఆర్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ ఉదయం 10 గంటలకు వచ్చి 11.05 గంటలకు వెళ్లిపోయారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న మెన్స్ హౌస్‌సర్జన్స్ హాస్టల్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఉంచిన డాక్టర్ సతీష్ 11.10 గంటలకు ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎన్ఆర్‌సీలో పలువురు సిబ్బంది పత్తా లేకుండా పోయారు. వైద్యులు, పలువురు సిబ్బంది ఇలా వచ్చి..అలా వెళ్లిపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

### అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శిగా కృష్ణప్ప



ఐక్యత చాటుతున్న అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

**అనంతపురం:** అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీగా ఎం.కృష్ణప్ప, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.శ్రీనివాసులు, ఎం.జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సి.హనుమన్న తెలిపారు. శనివారం నగరంలో అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ సంక్షేమానికి పలు తీర్మానాలు, సొసైటీ జమా ఖర్చుల వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలాజీ నాయక్, ఈసీ మెంబర్లు జే. శ్రీనివాసులు, చౌడప్ప, చంద్రమోహన్, గురుస్వామి, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బోయి గిరిజమ్మకు బొట్టు పెడుతున్న బ్రహ్మకుమారీ

### సందడిగా 'రక్షా బంధన్'

**అనంతపురం కల్చరల్:** అనుబంధం, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే 'రక్షా బంధన్' వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం సందడిగా జరిగాయి. అక్కచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టి ఆశీర్వాదాలు అందుకున్నారు. వివిధ స్వచ్ఛంధ సేవా సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈశ్వరీయ విశ్వవిద్యాలయ బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# మహాసభలు జయప్రదం చేయండి

**రాప్తాడురూరల్/రాప్తాడు:** ఈనెల 12,13 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆత్మకూరు మండల కార్యదర్శి బండారు శివ అధ్యక్షతన రాప్తాడు నియోజక కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ.. వందేళ్ల సుదీర్ఘ పోరాటాల ఘన చరిత్ర కలిగిన సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ముందుగా జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సాధించిందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికుల హక్కుల సాధనకై రాజ్యాంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. విద్యార్థి, యువజన, రైతాంగ సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రమేష్, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి నరేష్, సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, సహాయ కార్యదర్శి చలపతి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'సుల్తాన్ వారసులు' పుస్తకావిష్కరణ

**అనంతపురం:** అనంత చరిత్రలో అంతర్భాగమై, అభివృద్ధితో మమేకమైన శతాబ్దాల కిందటి జీవిత విశేషాలను తెలిపే 'సుల్తాన్ వారసులు' పుస్తకావిష్కరణ ఆదివారం జరుగనుంది. పుస్తకావిష్కరణకు మాజీ డీజీపీ ఏకే ఖాన్, ఆయన కుమారుడు కలెక్టర్ ముజిమిల్ ఖాన్, ఎస్పీ పి.జగదీష్ తదితరులు హాజరుకానున్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని సాక్షి కార్యాలయం సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 5:30 గంటలకు కార్యక్రమం జరగనుంది.

### యువకుడిపై పోక్సో కేసు

**అనంతపురం:** ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై అనంతపురం వన్‌టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు.. బలిజ విజయ్ అక్క శైలజ ఇంట్లో పని చేయడానికి నగరంలో 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక వెళ్లేది. ఆ చనువుతో బలిజ విజయ్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. దీనిపై బాలిక పెద్దమ్మ విజయ్‌ను నిలదీయగా.. తాను ప్రేమించలేదు.. పెళ్లి చేసుకోను అని చెప్పాడు. ఆ యువకుడిపై బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

### మద్యం విక్రేతల అరెస్టు

**యాడికి:** మండలంలోని రాయలచెరువులో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. శనివారం రాయలచెరువు గ్రామంలో వల్లపు శ్రీనివాసులు 14 బాటిళ్లు, వల్లపు కుళ్లాయిస్వామి 10 మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా అందిన సమాచారం మేరకు రాయలచెరువుకు వెళ్లి నిందితులను అరెస్టు చేశామన్నారు.

### రోడ్ల దుస్థితి అధ్వానం



వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోడ్ల దుస్థితి అధ్వానంగా తయారైంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి బస్టాండ్‌లో వర్షపు నీరు నిలబడింది. గుంతల్లో ఎక్కడికక్కడే నీరు ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇక ఆర్టీసీ డిపో పక్కన ఉన్న హోటల్ డ్రైనేజీ ప్రవహించడంతో పరిసరాలు కంపు కొడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

# శ్రావణ పౌర్ణమి శోభ



పూజలందుకున్న ఉమా నీలకంఠేశ్వరుడు

**అనంతపురం కల్చరల్:** శ్రావణ పౌర్ణమి వేడుకలు శనివారం పలు ఆలయాల్లో ఘనంగా జరిగాయి. హయగ్రీవ జయంతి, జంధ్యాల పౌర్ణమి వేడుకలు కూడా కలిసి రావడంతో ప్రత్యేక పూజలు, సత్యదేవుడి వ్రతాలు నిర్వహించారు. మొదటి రోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠం, అశోక్ నగర్‌లోని రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయం, వివిధ బాబా మందిరాల్లో సామూహిక వ్రతాలు జరిగాయి. శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలోని తపోవనంలోని శ్రీక్షేత్రంలో హయగ్రీవుడికి అభిషేకాలు, అలంకార సేవలు చేపట్టారు. హెచ్చెల్సీ కాలనీలో మంజునాథ స్వామి ఆలయంలో జరిగిన ఐశ్వర్యేశ్వర వ్రతంలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మూడవ రోడ్డులోని బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో ఉపాకర్మ వేడుకలు జరుపుకున్నారు. జంధ్యాలను శాస్త్రోక్తంగా వేదపండితులు మార్పించారు. పలు చోట్ల మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

**రాప్తాడు/ఆత్మకూరు:** శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ గౌరీ వ్రతాలు నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, కలశపూజ, బిల్వార్చన, రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అంకురార్పణ, కలశ ప్రతిష్ఠ, గణపతి హోమం, లక్షబిల్వార్చన తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. మృత్యుంజయ యజ్ఞం, రుద్రహోమం, లలితా సహస్ర నామ పఠనం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో శనివారం రక్షాబంధన్ పండుగను అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ బంధానికి ప్రతీకగా రాఖీ కట్టి శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

### రేపు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

**ఆత్మకూరు:** మండల కేంద్రంలోని కనకదాస కల్యాణ మండపంలో సోమవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జొన్నగిరి బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### బైక్‌ను ఢీకొన్న నీటి ట్యాంకర్

- వ్యక్తి మృతి

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం కురుగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వైఎస్సార్ కాలనీకి చెందిన ఎస్.వీరారెడ్డి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి క్రమంలో భాగంగా పనికి వెళ్లి బైక్‌లో తిరిగి ఇంటికి బయలుదేరాడు. కురుగుంట ప్రధాని రహదారి నుంచి వైఎస్సార్ కాలనీ వైపు బైక్‌ను క్రాస్ చేస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన నీటి ట్యాంకర్ అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వీరారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ అక్కడే అనాథ అంధుల ఆశ్రమానికి చెందినదిగా గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### వృద్ధురాలి నేత్రదానం



నర్మదమ్మ (ఫైల్)

**అనంతపురం మెడికల్:** నగరానికి చెందిన నర్మదమ్మ (82) అనే వృద్ధురాలు శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, కుమారులు కుమార్, కిషోర్ నేత్రాలు దానం చేయడానికి ముందుకొచ్చారు. సేకరించిన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి పంపేలా సాయి ట్రస్టు వ్యవస్థాపకుడు విజయసాయి చర్యలు తీసుకున్నారు.

### 'బీసీలకు 49 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి'

**అనంతపురం టవర్‌క్లాక్:** రాష్ట్రంలో ఉన్న బీసీలకు చట్టసభలు, విద్యా, ఉద్యోగాల్లో 49 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జేఏసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 శాతం ఉన్న అగ్రకులం వారు రాజ్యాలు ఏలుతున్నారన్నారు. 56 శాతం జనాభా ఉన్న బీసీల రిజర్వేషన్లను అడుకుంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కేవలం 26 శాతం రిజర్వేషన్లు మాత్రం అమలు చేసి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకే చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఇప్పటికై నా బీసీలకు రిజర్వేషన్లు పెంచి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్, నరేష్, అభిరామ్, పార్థు, గోవర్దన్, ప్రేమ్ నంద తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



చిన్మయ నగర్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

**రాప్తాడు:** శ్రావణ మాసం మూడో శనివారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితి జరుపుకున్నారు. నాగుల కట్ట, పుట్టకు మహిళలకు ప్రత్యేక పూజలు చేశారు. రాప్తాడులో ఉమా నీలకంఠేశ్వర స్వామి, లక్ష్మీ పండమేటి రాయుడు, షిర్డీ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలోని నాగుల దేవతల విగ్రహాలకు పాలతో అభిషేకం చేశారు. పుట్టకు పసుపు కుంకుమలు, తోరాలు (పసుపు పూసిన పచ్చిదారాలు) అలంకరించి పాలుపోసి చలివిడి ముద్దలు, నువ్వుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు.